# నవభూమి

## కరీంనగర్

అనుబంధం

29 మే,2025 గురువారం పేజీలు:5

www.epaper.navabhoomi.in




# నైరుతి వచ్చేసింది



**సిరిసిల్ల -నవభూమి:** రోహిణీ కార్తె వచ్చిందంటే ఎండ వేడికి మాడు పగిలిపోయేది. రోహిణిలో రోళ్లు పగిలే ఎండలు ఉంటాయనే నానుడిని వెనక్కి నెడుతూ నైరుతి రుతుపవనాలు రెండు వారాల ముందే రాజన్న సిరిసిల్ల జిల్లాను పలకరించాయి. మంగళవారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలో కుండపోతగా కురిసిన వర్షానికి పలు ప్రాంతాలు జలమయంగా మారాయి. తొలకరి పలకరింపుతో జిల్లా ప్రజలకు ఊరట కలిగినా.. మెరుపులు, ఉరుములు, పిడుగులతో భయానికి గురిచేసింది. ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామంలో పశువుల కాపరి దాసరి లక్ష్మణ్(35) పిడుగుపాటుకు మృతిచెందాడు. సిరిసిల్లతో పాటు పలు గ్రామాల్లో చెట్లు నేలకూలాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి వర్షం కురవడంతో ప్రజలు ఊరట చెందగా, రైతులు ఖరీఫ్ సాగుకు ఇబ్బంది ఉండదనే ఆశలతో ఉన్నారు. మూడు, నాలుగు రోజులుగా మోస్తరు వర్షాలు పడుతుండగా మంగళవారం భారీ వర్షం కురిసింది. మండలాల్లోని ఒర్రెలు, వాగులకు జలధార వచ్చింది. ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామ శివారులో వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.జిల్లాలో సరాసరి 57.27 మిల్లీమీటర్ల వర్షం రాజన్న సిరిసిల్ల జిల్లాలో సరాసరి 57.27 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా వేములవాడలో 102.5 మిల్లీమీటర్లు, చందుర్తిలో 81.5, కోనరావుపేటలో 72.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. బోయినపల్లిలో 63.0, ముస్తాబాద్‌లో 56.3, వేములవాడ రూరల్‌లో 52.8, వీర్నపల్లిలో 52.3, సిరిసిల్లలో 52.0, ఇల్లంతకుంటలో 30.5, ఎల్లారెడ్డిపేటలో 22.0, తంగళ్లపల్లిలో 21.5, రుద్రంగి 21.5, గంభీరావుపేటలో 3.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మరో మూడు రోజుల పాటు వరుసగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచిస్తోంది.2009లో రోహిణీ కార్తెలో...రోహిణీ కార్తెలో ఈసారి రోళ్లు పగలకుండా వర్షాలు కురుస్తున్నాయి. నైరుతి రుతుపవనాలు కేరళకు ముందు వచ్చినా తెలంగాణలో మాత్రం జూన్‌లో మాత్రమే వర్షాలు వచ్చాయి. కొన్ని సందర్భాల్లో జూలై వరకు కూడా వర్షాలు కురవని పరిస్థితి ఉండేది. 2009లో రోహిణీ కార్తెలో కుండపోతగా వర్షాలు మొదలు కాగా మళ్లీ 16 సంవత్సరాల తరువాత రోహిణీ కార్తెలో వర్షాలు కురవడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా మే నెలలో జిల్లాలో 45 గరిష్ఠ డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదుకాగా, ఈసారి 43 నుంచి 44 గరిష్ఠ డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వానాకాలం సాగును రైతులు ముందస్తుగానే మొదలు పెట్టడానికి ఏర్పాట్లు చేసుకున్నారు.జిల్లా కేంద్రం జలమయం..జిల్లా కేంద్రంలో కుండపోతగా కురిసిన వర్షానికి పలు ప్రాంతాలు జలమయంగా మారాయి. సిరిసిల్ల చేనేత చౌక్, గోపాల్‌నగర్, మార్కెట్ ఏరియా, అనంతనగర్, సంజీవయ్యనగర్, శాంతినగర్, పెద్దబజార్, బీవైనగర్, గణేష్‌నగర్, సుందరయ్యనగర్‌లాంటి లోతట్టు ప్రాంతాల్లో రోడ్లు జలమయంగా మారాయి. ఉరుములు, మెరుపులు, పిడుగులు, గాలిదుమారంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.రైతుల్లో ఇబ్బందులు..జిల్లాలో ఒక్కసారిగా కుండపోతగా కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడిన కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు హైరానా పడ్డారు. జిల్లాలో 128 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ పూర్తికాగా 144 కేంద్రాల్లో కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. పౌరసరఫరాల శాఖ 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ఉండగా ఇప్పటివరకు 2.46 లక్షల ధాన్యం సేకరించారు. కాంటా వేయని ధాన్యం దాదాపు ఇంకా 50వేల మెట్రిక్ టన్నుల వరకు ఉంటుందని భావిస్తున్నారు. జిల్లాలో ఐకేపీ ద్వారా 28,841 మంది రైతుల నుంచి రూ 438.40 కోట్ల విలువైన 1,88,967 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. సింగిల్ విండోల ద్వారా 7,003 మంది రైతుల నుంచి రూ 114.71 కోట్ల విలువైన 49,445 మెట్రిక్ టన్నులు, డీసీఎంఎస్ ద్వారా 390 మంది రైతుల నుంచి రూ 6.33 కోట్ల విలువైన 2,726 మెట్రిక్ టన్నులు, మెప్మా ద్వారా 700 మంది రైతుల నుంచి రూ 12.90 కోట్ల విలువైన 5,559 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. జిల్లాలో 36,934 మంది రైతుల నుంచి రూ 572.34 కోట్ల విలువైన ధాన్యం సేకరించగా 31,059 మంది రైతుల ఖాతాల్లో రూ 431.71 కోట్లు జమ చేశారు. వర్షాలు మొదలు కావడంతో రైతులు హైరానా పడుతున్నారు. కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలనే రైతులు కోరుతున్నారు. తడిసిన ధాన్యంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం మొలకెత్తి ఇబ్బందులకు గురవుతున్నారు.

# రెవెన్యూ సదస్సులను నిర్వహించాలి



## పంచాయతీలకు

# నిలిచిన నిధులు

**జగిత్యాల-నవభూమి:** రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులను నిలిపి వేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్థానిక సంస్థలకు నిధులు ఇచ్చే పరిస్థితిలో లేకపోవడంతో గడిచిన 15 నెలలుగా పల్లెల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. జిల్లా, మండల పరిషత్ కార్యాలయాల నిర్వహణ కష్టతరంగా మారింది. గ్రామ పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి మరి అత్యవసర పనులు చేయిస్తున్నారు. 2024 ఫిబ్రవరితో గ్రామ పంచాయతీల్లో పాలక వర్గాల పదవీ కాలం పూర్తయ్యింది. వెంటనే ఎన్నికల నిర్వహణ చేపట్టాల్సి ఉండగా కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన పెట్టింది. ఏడాదిన్నర కావస్తున్నా పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఎలాంటి అడుగులు పడటం లేదు. ఇక మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల కాల పరిమితి కూడా 2024 జులై 5వ తేదీతో ముగిసింది. దీంతో పరిషత్ ఎన్నికల నిర్వహణ లేకపోవడంతో వాటలోనూ ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది.ఆర్థిక సంఘం నిధుల ఖర్చు ఇలా...స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఆయా గ్రామాల జనాభాను బట్టి ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తుంది. కేంద్రం ఇచ్చే నిధులతో పాటు రాష్ట్రం ఇచ్చే గ్రాంట్‌ని అందులో కలిపి ఇవ్వాలనే నిబంధన ఉంది. అయితే పాలకవర్గాలు లేకపోవడంతో ఆర్థిక సంఘం నిధుల విడుదలని నిలిపి వేసింది. కేంద్రం నుంచి జిల్లాకు వచ్చే మొత్తం నిధుల్లో 5 శాతం జిల్లా పరిషత్‌కు, 10 శాతం మండల పరిషత్‌లకు, 85 శాతం గ్రామ పంచాయతీలకు కేటాయిస్తారు. దీంతో ఆయా పాలక వర్గాల్లోని ప్రజాప్రతినిధులు వారి పరిధిలో అభివృద్ధి పనులు చేసేందుకు అవకాశం ఉండేది. ఆ వచ్చిన నిధుల్లోనే 6 శాతం కార్యాలయాల నిర్వహణకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పంచాయతీల్లో విద్యుత్, నెట్ బిల్లులు, వాహనాల అద్దె చెల్లింపు, ఇతర ఖర్చులకు వినియోగించేవారు. కేంద్రం నిధులు నిలిపివేయడంతో ఇప్పుడు ఈ చెల్లింపులన్నీ నిలిచిపోయాయి.అప్పుల్లో కార్యదర్శులు..వర్షాకాలంలో గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ కొనడానికి కూడా డబ్బులు లేవు. ప్రతీ నెల విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐలు, పారిశుధ్య కార్మికులకు వేతనాలు, వీధి దీపాల నిర్వహణ తదితర పనుల కోసం అప్పులు చేయాల్సి వచ్చిందని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు వస్తాయనే ఆశతో కార్యదర్శులు అప్పులు తీసుకువచ్చి మరీ పనులు చేయిస్తున్నారు. సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో ఇటు బిల్లులు రాక అటు వడ్డీలు పెరిగి అప్పుల పాలవుతున్నారు. మండల పరిషత్తులకు సంబంధించి రెండేళ్ల నుంచి ఎంపీడీవోల వాహనాలకు అద్దె చెల్లింపులు, ఇంటర్నెట్ బిల్లులు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా పరిషత్‌లో నిల్వ ఉన్న ఫండ్ నుంచి కార్యాలయం నిర్వహణ కొనసాగిస్తుండగా రానున్న రోజుల్లో అది కూడా ప్రశ్నార్థకంగా మారనుంది. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి, ఆర్థిక సంఘం నిధులు విడుదల అయ్యేలా చొరవ చూపి గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలని ప్రజలు కోరుతున్నారు.నిర్వహణ భారంగా మారింది సంతోష్‌రావు, జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రధాన కార్యదర్శి పంచాయతీల అభివృద్ధికి మా వంతు కృషి చేస్తున్నాం. గ్రామాల్లో ప్రగతి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుకుంటున్నాం. ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కాక నిర్వహణ భారంగా మారింది. అప్పులు చేసి పనులు చేయాల్సి వస్తోంది.నిధుల విడుదలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం సీహెచ్ మదన్‌మోహన్, జిల్లా పంచాయతీ అధికారి పంచాయతీలకు నిధులు విడుదల కాని మాట వాస్తవం. నిధులు విడుదల చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు ఖాతాల్లో జమ అవుతాయని ఆశిస్తున్నాం. పంచాయతీల అభివృద్ధికి అందరి సహకారం అవసరం.



## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



**సిరిసిల్ల -నవభూమి:** రాష్ట్ర ప్రభుత్వం నేతన్న సంక్షేమం కోసం ప్రవే శపెట్టిన సంక్షేమపథకాలను మరమగ్గాల కార్మి కులతోపాటు అర్హులైన అనుబంధంగా కార్మికు లు సద్వినియోగం చేసుకోవాలని చేనేత జౌళి శాఖ ఏడీ రాఘవరావు కోరారు. సిరిసిల్ల అర్బ న్ పరిధిలోని చంద్రంపేట గ్రామంలోని పద్మ శాలీ సంఘ భవనంలో మంగళవారం ప్రభు త్వ జిల్లా వైద్యశాలలోని మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్, చేనేత జౌళి శాఖలు సం యుక్తంగా మనోవికాస సదస్సును ఏర్పాటు చేసి మరమగ్గాల కార్మికులతో పాటు వారి కుటుంబాలకు మానసిక స్థితిగతులపై అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజ రైన ఏడీ రాఘవరావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్క కార్మికుడు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి లోకి రావాలన్నారు. కార్మికుల కోసం ప్రభుత్వం వస్త్ర పరిశ్ర మల కోసం మహిళాశక్తి చీరలను ప్రత్యేక పథకంగా ఏర్పా టుచేసిందన్నారు. చేతినిండా పనికల్పించే ఉద్దేశ్యంతో వెల్ఫే ర్ డిపార్ట్‌మెంట్, సర్వశిక్ష అభియాన్ స్కూల్ యూనిఫాం లతో పాటు మరికొన్ని ప్రైవేటు వస్త్రాలను తయారు చేసేం దుకు ఆర్డర్‌లను కూడా ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం గా ఉందన్నారు. నిరంతం పని కల్పించేందుకు కృషి చేస్తు న్నామన్నారు. కార్మికల సంక్షేమ కోసం ఏర్పాటు చేసిన త్రిఫ్ట్ పథకం, నేతన్న బీమాలాంటి పథకాలను అమలు చేస్తున్నా మన్నారు. సైకాలజిస్ట్ పున్నంచందర్ మాట్లాడుతూ ఆత్మహ త్యల సమస్యలకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపుతోం దన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఫెసిలిటేర్ వేముల మార్కెండేయులు, జక్కని దేవదాస్, కొండ ఉమ, బూర శ్రీమతి, మ్యాన బాలకిషన్, కోడం శ్రీనివాస్, పులి మహేం దర్, మ్యాన వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఖనిలో క్లోజ్డ్ డ్రైన్ల నిర్మాణం

**కోల్‌సిటీ, -నవభూమి:** గోదావరిఖనిలోని ప్రధాన నాలా అడ్డగుం టపల్లి- కళ్యాణ్‌నగర్ - 2ఏ నాలాలను ఆధునీకరి స్తున్నారు. పట్టణంలోని ప్రధాన కాలనీల గుండా వెళ్లే ఈ నాలాతో దుర్గంధం వ్యాపి స్తుంది. ఈ నాలాను క్లోజ్డ్ డ్రైన్‌గా మార్చా లని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ప్రతిపాదిం చారు. ఈ మేరకు అమృత్ 2 పథకంలో రూ.20 కోట్ల వ్యయంతో 2 కిలోమీటర్ల మేర డ్రైన్ నిర్మిస్తున్నారు. తిలక్‌నగర్ డౌన్ నుంచి ప్రారంభమయ్యే నాలాలు ఆర్ఎఫ్ సీఎల్ నుంచి వచ్చే నీరు, అడ్డగుంటపల్లి చెరువు ద్వారా ఎన్‌టీఆర్‌నగర్ నాలాకు చేరుతుంది. ఎన్‌టీఆర్‌నగర్ నుంచి కాలనీలు ఉన్నాయి. ఎన్‌టీఆర్ నగర్, మున్సి పల్ వర్కర్స్ కాలనీ, కళ్యాణ్‌నగర్, ఊర్వశి థియేటర్ ఏరియా, ఉల్లిగడ్డల బజార్, మేదరిబస్తీ, సీతానగర్, లెనిన్‌నగర్ మీదుగా 2ఏ మోరీ వద్దకు ఈ నాలా చేరుతుంది. ఈ నాలాపై రూ.20కోట్ల వ్యయం తో ఎస్‌టీపీలు నిర్మిస్తున్నారు. నాలాను క్లోజ్డ్ డ్రైన్(బాక్స్‌టైప్)గా ఆధునీకరించను న్నారు. మంగళవారం ఈ డ్రైన్ ప్రాంతాలను ఎమ్మెల్యే పరిశీలించారు. కళ్యాణ్‌నగర్‌లో స్థానిక ప్రజలతో కొబ్బరికాయ కొట్టించి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లా డుతూ రామగుండం నగరాభివృద్ధికి ప్రభుత్వం ఇచ్చిన నిధులను సమర్థవంతంగా వినియోగిస్తున్నామని, క్లోజ్డ్ డ్రైన్ పద్దతిలో ఆధునీకరించడం వల్ల దుర్గంధం వ్యాపిం చదన్నారు. దీనిపై గ్రీనరీని అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్పొరేషన్ ఎస్ఈ శివానంద్, ఈఈ రామన్, ప్రజారోగ్యశాఖ అధికా రులు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, మాజీ కార్పొరేటర్లు మహంకాళి స్వామి, కొలిపాక సుజాత, పాతపెల్లి ఎల్లయ్య, ముస్తాఫా, బాల రాజ్‌కుమార్, నాయకులు పెద్దెల్లి ప్రకాష్, గట్ల రమేష్, మారెల్లి రాజిరెడ్డి, పెద్దెల్లి తేజస్విని, దశరథం, రవీందర్ పాల్గొన్నారు.



# యథేచ్ఛగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ




**కరీంనగర్ -నవభూమి:** కరీంనగర్‌లో ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. చిరు వ్యాపారులు ఫుట్‌పాత్‌లపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేసుకుంటున్నారు. పెద్దపెద్ద దుకాణదారులు వారి సామగ్రిని ఫుట్‌పాత్‌లపై పెడుతున్నారు. దీంతో పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వాహనాల రద్దీ కారణంగా తరచుగా పాదచారులు వాహనాల కారణంగా ప్రమాదాలకు గురవుతున్నారు. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు టవర్‌సర్కిల్, రాజీవ్‌చౌక్, కమాన్, శాస్త్రిరోడ్, ఇందిరాచౌక్, మంచిర్యాల చౌరస్తా, కోర్టు చౌరస్తా, రాంనగర్ చౌరస్తా, మంకమ్మతోట, నాకా చౌరస్తా తదితర ముఖ్యకూడళ్లు, ప్రధాన రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌ల ఆక్రమణతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికే టవర్‌సర్కిల్, కూరగాయల మార్కెట్ ఏరియాలో రోడ్లపైననే వీధి వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో అక్కడ నిత్యం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు విపరీతమైన రద్దీ నెలకొంటున్నది. నామమాత్రంగా దాడులు నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో అప్పడప్పుడు ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన సామాగ్రిని తొలగిస్తున్నారు. ఒకటి, రెండ్రోజుల తరువాత తిరిగి ఎప్పటిమాదిరిగానే ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమిస్తున్నారు. జోన్‌ల గుర్తింపుతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం...కరీంనగర్‌లో చిరువ్యాపారులు ఎడెక్కడ వ్యాపారాలు నిర్వహించుకోవాలి? ఎక్కడ పెట్టకూడదు? సాయంత్రం మాత్రమే వ్యాపారాలు చేసుకునే ప్రాంతాల గుర్తించి కేటాయించాల్సిన అవసరముంది. ఈ ప్రక్రియలోనే వ్యాపారాలు, పార్కింగ్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని కొన్ని జోన్లను రూపొందించాల్చి ఉంది. ఆ ప్రాంతాల్లోనే వ్యాపారాలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకుంటే టవర్‌సర్కిల్, కూరగాయల మార్కెట్, ప్రకాశం గంజ్ తదితర రద్దీ ప్రాంతాల్లో ట్రాపిక్ సమస్యలు తగ్గే అవకాశం ఉంది. వాహనాలు నిలిపే ప్రాంతాలను పార్కింగ్ జోన్, నిలపని ప్రాంతాలను నో పార్కింగ్ జోన్, వ్యాపారాలు, ఇతర నిర్వాహణకు అనుమతినిస్తూ గ్రీనోజోన్, అసలు ఎటువంటి నిర్వహణ ఉండకుండా రెడ్‌జోన్‌లుగా గుర్తించి, అవన్నీ పక్కా అమలయ్యేలా చూస్తే సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ఫుట్‌పాత్ వ్యాపారాలవల్ల ఎక్కడెక్కడ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయో పోలీసులు జాబితాను తయారుచేసి మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో పరిష్కరించాలని నగరవాసులు కోరుతున్నారు. కొంతకాలం కిందటే చిరు వ్యాపారుల కోసం వెండింగ్ జోన్‌ను ఏర్పాటు చేసిన మున్సిపల్ అధికారులు చిరు వ్యాపారులను అక్కడికి పంపించటంలో విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. పద్మవ్యూహంగా టవర్‌సర్కిల్ ప్రాంతం....కరీంనగర్‌లోని టవర్‌సర్కిల్, కూరగాయల మార్కెట్ ప్రాంతాలకు నగరవాసులు వెళ్లేందుకు జంకుతున్నారు. పట్టణంలోని నిత్యావసర సరుకుల దుకాణాలతో పాటు ఎలక్ట్రికల్, ఫర్నిచర్, బట్టలు, యంత్రసరికరాలతో కూడిన ఇతర ముఖ్య దుకాణాలన్ని ఇక్కడనే ఉంటాయి. ఉమ్మడి జిల్లా నుంచి ఇక్కడికి వేల సంఖ్యలో కొనుగోలుదారులు వస్తుంటారు. ప్రధాన కూరగాయలు, పండ్ల మార్కెట్ కూడా ఇక్కడే ఉండడంతో ఈ ప్రాంతంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కాలుపెట్టడానికి కూడా స్థలం లేకుండా రద్దీ ఉంటుంది. రోడ్డుకు ఇరువైపుల పండ్లు, కూరగాయల దుకాణాలు, మరోవైపున ద్విచక్రవాహనాల రాకపోకలు, సరుకులను తీసుకువచ్చిన ఆటోలు, ఇతర వాహనాలతో కొనుగోలుదారులు ఆ ప్రాంతానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల పార్కింగ్ తీవ్రమైన సమస్యగా నెలకొంది. ప్రధాన కూడలి అయిన టవర్‌సర్కిల్, రాజీవ్‌చౌక్, ప్రకాశం గంజ్ ప్రాంతాల్లో పార్కింగ్ జోన్ లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలను అడ్డదిడ్డంగా నిలపడంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి.



# రెవెన్యూ సదస్సులను నిర్వహించాలి

**సిరిసిల్ల -నవభూమి:** జిల్లాలోని అన్ని మం డలాల్లో జూన్ 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సు లను నిర్వహించడంతో పాటు అకాల వర్షంతో నష్టపోయిన వివరా లను కలెక్టర్ సేకరించి అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం హైదరా బాదు నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో సీఎం మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్ర మాల అమలులో కలెక్టర్ కీలకపాత్ర పోషించాలని సూచించారు. జిల్లాలో ఉన్న రైస్ మిల్లులను కలెక్టర్ నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడైనా రైతులకు అన్యాయం చేయాలని మిల్లర్లు చూస్తే వెంటనే యాక్షన్ తీసుకోవాలని సూచించారు. అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేల పరిహారం అందిం చేందుకు నివేదిక తయారుచేసి ప్రతిపాదనలు పంపాలని ము ఖ్యమంత్రి తెలిపారు. వర్షాలు ముందుగా రావడం వల్ల వ్యవ సాయ శాఖ తన ప్రణాళికలలో మార్పులు చేసుకోవాలని, రైతు లకు అవసరమైన విత్తనాలు, యూరియా అందుబాటులో ఉం డాలన్నారు. విత్తనాల, ఎరువులు అక్రమస్టాక్ ఉంటే కఠిన చర్య లు తీసుకోవాలని అన్నారు. నకిలి విత్తనాల అమ్మేవారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు. భూభారతి చట్టం ముందస్తు గా నాలుగు పైలెట్ మండలాలను ఎంపిక చేసుకున్నామని, అనంతరం ప్రతి జిల్లాలో ఒక మండలానికి పైలట్‌గా ఎంపిక చేసుకొని రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, ప్రజల నుండి వచ్చిన భూ సమస్యల దరఖాస్తులను పరిష్కరించాలని సీఎం తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి వ్యవస్థ ప్రజలను భూతంలా పీడించిందని, భూ భారతి చట్టం పేదలకు చుట్టంలా పని చేస్తుందని సీఎం తెలిపారు. పైలెట్ మండలాలో వచ్చిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మిగిలిన ప్రాంతాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. వానాకాలం పంట సాగు కోసం రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో పెట్టాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో శేషాద్రి, డీఎం సివిల్ సప్లై రజిత డీసీఎస్‌ఓ వసంతలక్ష్మి పీడీ హౌ సింగ్ శంకర్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఆత్మకూర్‌లో ఇసుక డంపు సీజ్ చేసిన తహసీల్దార్ శ్రీనివాస్



**మెట్‌పల్లి -నవభూమి:** మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామంలో అక్రమంగా నిల్వవుంచిన ఇసుక డంపును మెట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ బుధవారం సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆత్మకూర్‌లో తనిఖీలు నిర్వహించగా, ఎలాంటి అనుమతులు లేకుండా సుమారు వంద ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను నిల్వ ఉంచినట్లు గుర్తించారు. ఈమేరకు సంబంధిత ఇసుక డంపును తహసీల్దార్ సీజ్ చేశారు. అనుమతులు లేకుండా ఇసుకను నిల్వ ఉంచినా, రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ ఉమేశ్ ఉన్నారు.

## పశువులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



**రాయికల్, -నవభూమి:** ఆవులను, పశువులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సుధీర్ రావు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ఆవులు, పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి జగిత్యాల జిల్లా సరిహద్దు బోర్నపల్లి గ్రామంలో చెక్ పోస్ట్ ఏర్పాటు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. నిత్యం చెక్ పోస్ట్ వద్ద పశు వైద్యాధికారులు పర్యవేక్షణలో 24 గంటలు పోలీసులు అక్రమ రవాణా పై నిఘా పెడుతూ పశువుల అక్రమ రవాలను అరికట్టడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఎవరైనా పశువుల అక్రమ రవాణా చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలనీ ఎస్ఐ పేర్కొన్నారు.

## ఎన్టీపీసీలో అలరించిన బాలికల సాధికారత నృత్య ప్రదర్శన

**జ్యోతినగర్, -నవభూమి:** బాలికల సాధికారిత ధ్యేయంగా ఎన్టీపీసీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో గర్ల్స్ ఎంపైర్మెంట్ మిషన్ పేరిట వేసవి కాలంలో కొనసాగుతున్న బాలికల సాధికారత వర్క్‌షాప్ లో ని భాలికల సాంస్కృతిక ప్రదర్శన వేడుక అలరింప చేసింది. టౌన్షిప్ లోని కాకతీయ ఫంక్షన్హాల్లో నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాల్లో బాలికల నృత్యప్రదర్శన, పాటలు, ప్రసంగాలు, స్కిట్లు, యోగా, కరాటే ప్రదర్శనలతో వారి ప్రతిభను చాటుకున్నారు. ఈ వేడుకలకు సంయుక్త మహిళా సమితి సీనియర్ సభ్యురాలు సునీత జైకుమార్ శ్రీనివాసన్, దక్షిణ దీపాంజలి మహిళా సమితి అధ్యక్షురాలు రంజనా దువా అతిథులుగా హాజరై తిలకించారు. అనంతరం బుధవారం వారు వర్క్‌షాప్ను సందర్శించారు. తరగతి, భోజన గదుల సందర్శన, బాలికల విద్యాభ్యాసం, వర్క్‌షాప్ లో రోజువారి పనులను ప్రశంసించి బాలిక సాధికారతపై ప్రసంగించారు. అనంతరం వర్క్‌షాప్ ఆవరణలో మొక్కలు నాటారు.




### మూడు నెలల బియ్యం

# ఒకేసారి పంపిణీ

**పెద్దపల్లి-నవభూమి:** వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉండడంతో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలలకు సరిపడా రేషన్ సరుకు లను వచ్చే నెలలో ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నది. వారం రోజుల నుంచి జిల్లాలో గల పౌరసరఫరాల గోదాముల నుంచి వాహనాల ద్వారా రేషన్ షాపులకు బియ్యాన్ని తరలిస్తున్నారు. మొదట స్టేజ్ 1 గోదాముల నుంచి పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ స్టేజ్ 2 గోదాముల నుంచి రేషన్ షాపులకు సన్న బియ్యాన్ని రవాణా చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 2,20,326 వివిధ రకాల రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో ఆహార భద్రత కార్డులు 2,07,898, అంత్యోదయ అన్న యోజన కార్డులు 12,269, అన్నపూర్ణ కార్డులు 155 ఉన్నాయి. వీటి ద్వారా 6 లక్షల 27 వేల మంది వినియోగదా రులు ప్రతీ నెల లబ్ధి పొందుతున్నారు. మూడు నెల లకు సంబంధించి 12,600 మెట్రిక్ టన్నుల కోటాను ప్రభుత్వం కేటాయించింది. కుటుంబంలో ఉన్న ప్రతీ ఒక్కరికి నెలకు 6 కిలోల చొప్పున ప్రభుత్వం రేషన్ బియ్యం అందజేస్తున్నది. గతంలో వినియోగదారులకు దొడ్డు బియ్యాన్ని సరఫరా చేయగా, ఎన్నికల సంద ర్భంగా ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏప్రిల్ నుంచి సన్న బియ్యం సరఫరా చేస్తోంది. వచ్చే వర్షాకాలంలో భారీ వర్షాలు దేశవ్యాప్తంగా పడతాయని వాతావరణ కేంద్రం అధికారులు సూచించిన మేరకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఒకే నెలలో మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని, గోధుమలు, చక్కెర ఇవ్వాలని ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం తమకు ఒక నెల అవకాశం ఇవ్వాలని కేంద్రాన్ని కోరింది. జూన్ మాసా నికి సంబంధించి ఆ నెల కోటాను విడుదల చేస్తామని, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని జూలైలో ఇస్తామని వారు కేంద్రానికి లేఖ రాశారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం ససేమిరా అనడంతో విధిలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం జూన్, జూలై, ఆగస్టు మాసాలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని జూన్‌లోనే ఇవ్వాలని నిర్ణయించింది. ఆ మేరకు పది రోజుల నుంచి స్టేజ్ 1 నుంచి స్టేజ్ 2 గోదాములకు, అక్కడి నుంచి రేషన్ షాపులకు బియ్యా న్ని సరఫరా చేస్తున్నారు. రెండు రోజులుగా జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బియ్యం రవాణా చేసేటప్పుడు బియ్యం తడవకుండా ఉండేం దుకు లారీలు, వ్యాన్లపై



తాటిపత్రిలు, కవర్లు కప్పి సరఫరా చేస్తున్నారు. ప్రతీ రేషన్ షాపు ముందు జూన్, జూలై, ఆగస్టు మాసాలకు సంబంధించి ఒకే సారి రేషన్ సరుకులను అందజేస్తున్నట్లు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ప్రతీ నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తుండగా, మూడు నెలల రేషన్ సరుకులను ఒకే నెలలో సరఫరా చేస్తున్న దృష్ట్యా జూన్ 1 నుంచి నెలాఖరు వరకు సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఫోర్టిఫైడ్ రైస్‌తో కలిపి..రాష్ట్ర ప్రభుత్వం రేషన్ వినియోగదారులకు పంపిణీ చేస్తున్న సన్న బియ్యంలో ఫోర్టిఫైడ్ బియ్యం కలిపి సరఫరా చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకా రం రేషన్ బియ్యంలో ఫోర్టిఫైడ్ బియ్యం కలిపి ఇవ్వాల్సి ఉంది. రేషన్ వినియోదారులకు బలవర్ధక మైన ఆహారాన్ని అందించేందుకు గతేడాది నుంచి కేంద్ర ప్రభుత్వం రేషన్ బియ్యంలో ఫోర్టిఫైడ్ రైస్ కలిపి పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. కేంద్రం సరఫరా చేసే దొడ్డు బియ్యాన్ని కేవలం 20 నుంచి 30 శాతం మంది వినియోగదారులు మాత్రమే తింటుం డగా, మిగతా వినియోగదారులు రేషన్ డీలర్లకు, బయ ట వ్యాపారులకు కిలోకు 10 నుంచి 15 రూపాయల వరకు విక్రయించుకుంటున్నారు. ఆ బియ్యాన్ని కొం దరు వ్యాపారులు కొనుగోలు చేసి బయట మార్కెట్లో కిలోకు 30 నుంచి 35 రూపాయల చొప్పున విక్రయిం చుకుని సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజలు సన్న బియ్యాన్ని బయట మార్కెట్లో కిలోకు 40 నుంచి 50 రూపాయలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. ఇది గమనించిన కాంగ్రెస్ పార్టీ ఏడాదిన్నర క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే సన్న బియ్యం ఇస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు గడిచిన వానా కాలం సీజన్‌లో సన్నాలు పండించే విధంగా రైతులను ప్రోత్సహించేందుకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చింది. సేకరించిన ధాన్యాన్ని మర ఆడించి ఏప్రిల్ నెల నుంచి సన్న బియ్యాన్ని వినియోగదారులకు పం పిణీ చేస్తున్నది. అయితే ఇందులో ఫోర్టిఫైడ్ బియ్యం కలపకపోవడంతో కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిబం ధన ప్రకారం ఫోర్టిఫైడ్ రైస్ అందించాలని ఆదేశిం చడంతో సన్న బియ్యంలో ఫోర్టిఫైడ్ రైస్ కలిపి సర ఫరా చేస్తున్నది. మెజార్టీ ప్రజలు రేషన్ షాపుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యాన్ని తింటున్న నేపథ్యంలో ఫోర్టిఫైడ్ రైస్ కలిపి ఇవ్వడం వల్ల బలవర్ధకమైన పోషకాహారం అందనున్నది. కొత్త కార్డుదారులకు సెప్టెంబర్ తర్వాతే...జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి వచ్చే నెలలో ఒకేసారి రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు వచ్చే రెండు మాసాల్లో కొత్తగా మంజూరయ్యే రేషన్ కార్డుల వినియోగదారులకు ఆ నెలల్లో రేషన్ బియ్యం ఇచ్చే అవకాశాలు లేవు. ఈ నెల 20వ తేదీ వరకు జిల్లాలో ఉన్న పాత రేషన్ కార్డులు, కొత్తగా మంజూరైన రేషన్ కార్డులకు కోటా కేటాయించారు. ఆ తరువాత మంజూ రయ్యే కార్డుదారులకు సెప్టెంబర్ తర్వాతే బియ్యం పంపిణీ చేస్తారని తెలుస్తున్నది. మూడు మాసాలకు కలిపి 12,600 మెట్రిక్ టన్నుల బియ్యం కోటాను విడు దల చేసినందున కొత్తగా మంజూరు చేసే కార్డులపై బియ్యం సరఫరా చేయకపోవచ్చనే సూచనలు కనబడుతున్నాయి.

## పెద్దపల్లిలో పాత్రికేయులకు ఘన సన్మానం

**పెద్దపల్లి-నవభూమి:** తెలంగాణ ఉద్యమ సమయంలో చురుకుగా పనిచేసిన పలువురు జర్నలిస్టులను పెద్దపల్లి జిల్లా ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఘనంగా సన్మానించింది. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్స్ లో బుధవారం జరిగిన ఉద్యమ కారుల సన్మాన సభ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు డాక్టర్ చీమ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ అధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్ లో తెలంగాణ ఉద్యమ సందర్భంలో ఉదద్యమకారులతో కలిసి పనిచేసిన విలేకరులు పెద్దపల్లి టీ న్యూస్ రిపోర్టర్ కత్తెర్ల తిరుపతి యాదవ్, సిటీ న్యూస్ (సీనియర్) వీడియో జర్నలిస్ట్ తిర్రి సుధాకర్ గౌడ్ లను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. విలేకరులను సన్మానించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




# మానవ అక్రమ రవాణ నిర్మూలించడం అందరి బాధ్యత:పెద్దపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి




**పెద్దపల్లి -నవభూమి:** మానవ అక్రమ రవాణా నిర్మూలన లో ప్రజలు అందరు భాగస్వామ్యం అయినప్పుడే దీనిని సమూలంగా నివారించవచ్చు అని డీ ఈ ఓ మాధవి అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా మండలి సంస్థ ఆధ్వర్యంలో పెద్దపల్లి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల లో బుధవారం మానవ అక్రమ రవాణా గురించి ఉపాధ్యాయు లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీ ఈ ఓ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచం వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన చర్య అని, దీనికి పేద మధ్య తరగతి అమ్మాయిలు, మహిళలు ఎక్కువ గా గురవుతున్నారన్నారు. సైబర్ ట్రాఫికింగ్ అనేది చాలా వేగంగా విస్తరిస్తున్న జఠిలమైన సమస్య కావున పిల్లలకు ఫోన్ ఉపయోగించడం ద్వారా వచ్చే నష్టాలను తెలియజేయాలన్నారు. మాయమాటలు, ఉద్యోగ, సినిమా అవకాశం అంటూ పట్టణాలకు తీసుకెళ్లి వ్యభిచార గృహాలలో అమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అపరిచితుల పట్ల విద్యార్థిని లు అప్రమత్తంగా ఉండేలా టీచర్స్ అవగాహన కల్పించాలని, అక్రమ రవాణాను ఆదిలోనే అడ్డుకుంటే ఆడపిల్లలను రక్షించుకోవచ్చని చెప్పారు. వేధింపులకు గురైన మహిళలు టోల్ ఫ్రీ నంబర్లు 1098, 100, 1930, 181 లో సంప్రదించాలని సూచించారు. ఈ శిక్షణలో జిసిడిఒ కవిత, ప్రధానోపాధ్యాయురాలు అరుణ, ప్రజ్వల సిబ్బంది అంబర్ సింగ్, టీచర్స్ పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలు అందించినప్పుడే సత్కారాలు, గౌరవం:హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య

**హుజూరాబాద్ -నవభూమి:** ఉత్తమ సేవలు అందించినప్పుడే సత్కారాలు, గౌరవం దక్కుతుందని హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అన్నారు. ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన బత్తుల మానసతో పాటు వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగిణి దాసరి సరళ, ఏఎస్సై బండ సంపత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ స్వరూపా ముత్యంరావు లను పట్టణానికి చెందిన సిద్ధార్థనగర్ సొసైటీ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య బుధవారం ఘనంగా సన్మానించారు. శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ ఒకే వేదికపై వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారిని సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమమైన సేవలు అందించినప్పుడే ఇలాంటి సన్మానాలు, సత్కారాలతో ప్రజలు గౌరవిస్తారని అభిప్రాయ పడ్డారు. ప్రజలకు మరిన్ని సేవలు అందించి, ఇంకా పేరు ప్రఖ్యాతలతో పాటు ఉన్నత పదవులను అందుకోవాలని ఆకాంక్షించారు. అలాగే, జూనియర్ సివిల్ జడ్జి మానసను హుజూరాబాద్ పద్మశాలి సంఘం సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ నగర్ కాలనీ అధ్యక్షుడు సాగి వీరభద్రరావు, సీనియర్ నాయకులు తోట రాజేంద్రప్రసాద్, ముత్యంరావు, పీవీ సేవాసమితి అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, కార్యదర్శి బీ మనోజ్, పీడీ రాజి రెడ్డి, రవీందర్, తిరుపతి రెడ్డి, మాడ రాజి రెడ్డి, రాజమౌళి, సంపత్ రావు, న్యాయవాది శ్రీనివాస్, శ్రీనివాస రావు, రవీందర్, జయవర్ధన్, చిలుకమారి శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో సీఎం ఫొటో పెట్టితీరాలి

**వేములవాడ-నవభూమి:** సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టి తీరాల్సిందేనని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అర్బన్ మండలానికి చెందిన 371మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదా రులకు పట్టాలను కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాతో కలిసి అందజేశా రు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావే శంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కేటీఆర్ సొంత ఆఫీసు కాదని, ఆయన ఇందులో శాశ్వతంగా ఉండరని ఎద్దే వా చేశారు. సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఎవరు ఉంటే వారికి అధికారికంగా కేటాయించే క్యాంప్ ఆఫీస్ అని అన్నారు. ప్రతి నియోజకవర్గం కేంద్రంలో ప్రభుత్వం క్యాంపు ఆఫీస్‌లు నిర్మాణం చేసిందని, అది ప్రభుత్వ ఆఫీస్ అని, ప్రభుత్వ కార్యాలయాల్లో తప్పకుండా సీఎం ఫొటో పెట్టాల్సి ఉంటుందని హితవు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టడానికి కేటీఆర్‌కు ఎందుకు అంత నామోషీని ప్రశ్నించా రు. సీఎం ఫొటో ఉండాలని కాంగ్రెస్ కార్యకర్తలు అడగడంలో తప్పు లేదని, కాంగ్రెస్ కార్యకర్తలు ప్రశ్నిస్తే సహించలేక బీఆర్ఎస్ నాయ కులే దౌర్జన్యానికి దిగారన్నారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఊరు ఊరుకు పండగల అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్‌చైర్మన్ కనికరపు రాకేష్, కాం గ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య తదితరులు ఉన్నారు. అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు .బ్ధిదారులకు కలెక్టర్ సందీన్ కుమార్ ఝాతో కలిసి ఎమ్మె ల్యే ఆది శ్రీనివాస్ మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రా లను అందజేశారు.



ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభు త్వం అందించే ప్రతిఫలాలకు ఎవ్వరిని ఆశ్రయించాల్సిన అవసరం లేదని దళారులకు గానీ ఇతరులకు డబ్బులు ఇచ్చి పైరవీలు చే యాల్సిన అవసరంలేదన్నారు. అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు మం జూరు చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుకను ఉచితంగా ఇస్తామని, 30 రోజుల్లో లబ్ధి దారులు ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభించకుంటే రద్దయ్యే అవ కాశం ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ రొండి రాజు, పీడీ హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీరాజం, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**పెద్దపల్లి -నవభూమి:** రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, అందుకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణు అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర అవతరణ వేడుకల ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేడుకలు కలెక్టరేట్‌లో జరుగుతాయని, జిల్లాలోని ప్రతీ శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. ఫ్లాగ్, గ్రౌండ్ ఏర్పాట్లు పోలీస్, రెవెన్యూశాఖ అధికారులు సమన్వయంతో పూర్తిచేయాలన్నారు. వేదిక సీటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తిచేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. వైద్య శిబిరం, తాగునీరు ఏర్పాటు చేయాలని, ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వాన పత్రి కలు అందించాలన్నారు. పట్టణంలోని స్వశక్తి మహిళ సంఘాల ప్రతినిధులు హాజరయ్యేలా మెప్మా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్య అతిథి గౌరవ వందనం, బందోబస్తు ఏర్పాటు పకడ్బందీగా చేయాలన్నారు. డీసీపీ కరుణాకర్, ఏసీపీ జి.కృష్ణ, ఆర్డీవో గంగయ్య, కలెక్టరేట్ సివిభాగం సూపరింటెండెంట్ ప్రకాష్, అధికారులు, పాల్గొన్నారు. మీసేవ కేంద్రాలను నిబంధనల ప్రకారం నిర్వహించాలి నిబంధనల ప్రకారం మీసేవ కేంద్రాలను




నిర్వహించాలని అదనపు కలెక్టర్ డీ వేణు పేర్కొన్నారు. మంగళ వారం కలెక్టరేట్‌లో మీసేవా కేంద్రాల నిర్వహణపై అధికారులు, మీసేవా కేం ద్రాల ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడు తూ ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం కేంద్రాలలో అవసరమైన పెయిం టింగ్, సేవలను వివరించేలా నోటీస్ బోర్డు వివరాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం ఇతర ముఖ్యమైన పత్రాల జారీలో ఫిర్యాదులు రావద్దన్నారు. మీసేవ కేంద్రాల నిర్వహణపై ఆపరేటర్లు అప్రమత్తంగా ఉండాలని, ఫిర్యాదులు వస్తే తహసీల్దార్ నుంచి కలెక్టర్ వరకు తనిఖీ నిర్వహించవచ్చని సూచించారు. మీసేవ కేంద్రంలో ప్రతీ సర్వీసుకు ఎంత చెల్లించాలి, ఎన్ని రోజులలో సర్టిఫికెట్ జారీ అవుతుందో వివరాలతో సిటిజెన్ చార్టర్ ఏర్పాటు చేయాలన్నారు. మీ సేవా కేంద్రాలకు వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలని, సిటిజన్ చార్టర్‌లో పేర్కొన్న మేరకు మాత్రమే నగదు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈడిఎం కవిత, మీసేవా జిల్లా మేనేజర్ విద్యాసాగర్, పాల్గొన్నారు.

# జూన్ 2న యువ వికాసం ప్రొసీడింగ్స్ పంపిణీ

**పెద్దపల్లి, -నవభూమి:** వచ్చే నెల 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. రాజీవ్ యువ వికాసం అమలుపై బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామ కృష్ణారావుతో కలిసి బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్?? ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, జిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకం కింద లాభసాటి వ్యాపార యూనిట్ల గ్రౌండింగ్ చేసేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలన్నారు. రాష్ట్ర జీడీపీ వృద్ధిలో రాజీవ్ యువ వికాసం పథకం భాగస్వామ్యం కావాలన్నారు. ఒకే రకమైన యూనిట్లు మంజూరు కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీసీలో పెద్దపల్లి కలెక్టరేట్ నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ, జడ్పీ సీఈవో నరేందర్, డీఆర్‌డీవో కాళిందిని, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## గణనాథుని ఆకారంలో పుష్పం..ఆసక్తిగా తిలకిస్తున్న జనం



**వెల్గటూర్ -నవభూమి:** వెల్గటూరు మండలంలోని కిషన్ రావు పేట గ్రామంలో వెలిచాల కొమురయ్య ఇంటి ఆవరణంలో గణనాథుని పోలిన ఆకారంలో పుష్పం వికసించింది. దీంతో గ్రామస్తులు పుష్పాన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు.

## అల్లీపూర్‌లో అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

**రాయికల్, -నవభూమి:** రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన సిరిపురం శ్రీహరి (47) అనే వ్యక్తి అప్పుల బాధ తాళ లేక బుధవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యలు పాల్పడినట్లు ఎస్సై సుధీర్ రావు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. అల్లీపూర్ గ్రామానికి చెందిన శ్రీహరి చేసిన అప్పులు అధికమవడంతో అప్పులు తీర్చ లేనేమోనని మనస్థాపానికి గురై జీవితంపై విరక్తి చెంది అతడి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ కు ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య సిరిపురం అంజలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## చిన్న వర్షానికే ఇళ్లలోకి చేరుతున్న వరద నీరు.. ఆందోళనలో మంథని పట్టణ ప్రజలు

**మంథని,-నవభూమి:** చిన్న వర్షానికే ఇళ్లలోకి వరద నీరు చేరుతున్న సంఘటన పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో చోటు చేసుకుంది. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన వర్షానికి మంథని మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో దొంతులవాడ, భగత్‌నగర్, రావుల చెరువుకట్టలతో పాటు సత్యసాయినగర్, పద్మశాలివీధితో పాటు పలు వీధుల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఆందోళన చెందారు.పట్టణ అభివృద్ధిలో భాగంగా మంథని పట్టణంలోని అన్ని వార్డుల్లో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టిన విషయం విధితమే. అయితే అండర్ డ్రైనేజీ నిర్మాణ సమయంలో కొన్ని వార్డుల్లో పెద్ద పైపులు, మరికొన్ని వార్డుల్లో చిన్న పైపులను వేసి పనులు నిర్వహించారు. ఇంజనీరింగ్ అధికారులు సాంకేతిక తప్పిదం, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంతో నిర్వహించిన పనులు పట్టణ ప్రజలకు శాపంగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు.అండర్ డ్రైనేజీలు చిన్న పైపులతో నిర్మించడంతో వర్షపు నీరు రోడ్లపైకి పారి ఆయా వార్డుల్లో ఉన్న ఇళ్లలోకి చేరుతుంది. కేవలం ఈ చిన్న వర్షానికే ఇలాంటి పరిస్థితి ఉంటే రానున్న వర్షా కాలంలో ఎలాంటి పరిస్థితులు ఉంటాయో ఏంటో అని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రమైన మంథనిలో కాంట్రాక్టర్ ఇలా ఇష్టా రాజ్యం పనులు నిర్వహించడం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వర్షాకాలం ప్రారంభం కాక ముందే తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



### కొత్తపల్లిలో 476 భూముల రిజిస్ట్రేషన్ల

# రద్దును ప్రారంభించిన ఆర్డీవో



**గంగాధర,-నవభూమి:** కరీంనగర్ జిల్లా కొత్తపల్లి రెవెన్యూ పరిధిలోని 175, 197, 198 సర్వే నంబర్లలో జరిగిన 476 రిజిస్ట్రేషన్ లను రద్దు చేయడానికి అధికారులు సమయుత్తమైనారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం గంగాధర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 175, 197, 198 సర్వే నంబర్లలో జరిగిన 476 రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆర్డీవో మహేశ్వర్, జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారి ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. అన్ని సవ్యంగా సాగితే నాలుగు రోజుల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు తెలిపారు.30 ఏళ్లుగా సీలింగ్ యాక్ట్ అమలులో ఉన్న, సదరు భూముల్లో రిజిస్ట్రేషన్లు చేయవద్దని హైకోర్టు ఆర్డర్ ఉన్న, భూముల రిజిస్ట్రేషన్ పై సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఐదుసార్లు నోటీసులు వచ్చిన, వాటన్నిటిని భేకారతు చేస్తూ కొందరు సబ్ రిజిస్ట్రార్లు, కొంతమంది అక్రమాకులతో కలిసి భూముల రిజిస్ట్రేషన్ చేశారు. సీలింగ్ భూముల విషయం తెలియక అమాయక ప్రజలు అక్రమార్కుల వేసిన ఉచ్చులో చిక్కి భూములు కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఆ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు రద్దు కావడంతో ఆర్థికంగా నష్టపోయి రోడ్డున పడే పరిస్థితి వచ్చింది.కొత్తపల్లి మండలంలోని సర్వే నెంబర్లు 175, 197, 198 లలో చేసిన భూముల రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని జిల్లా కార్యాలయం నుండి గత పది రోజుల క్రితం గంగాధర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి నోటీసులు అందాయి. సదరు భూములపై 30 ఏళ్లుగా సీలింగ్ యాక్ట్ అమనులో ఉంది, ఎలాంటి లావాదేవులు జరపకూడదని హైకోర్టు ఆర్డర్ ఉంది. 175, 197, 198 సర్వే నెంబర్లలో సుమారు 20 ఎకరాల భూమి ఉండగా సదరు సర్వే నెంబర్లలో ఎలాంటి లావాదేవులు జరపవద్దని 1997, 1998, 2006, 2011, 2016 లో కరీంనగర్ రూరల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి నోటీసులు అందాయి.హైకోర్టు ఆర్డర్, కలెక్టర్ నోటీసులను బేకారతు చేసిన కొందరు సబ్ రిజిస్ట్రార్లు సర్వే 175 లో 3, 197 లో 291, 198 లో 182 రిజిస్ట్రేషన్లు చేశారు. 2018 వరకు కరీంనగర్ రూరల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో ఉన్న కొత్తపెల్లి మండలాన్ని గంగాధర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి మార్చారు. కానీ అప్పటికే కరీంనగర్ రూరల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 424 రిజిస్ట్రేషన్లు జరగగా, గంగాధర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 52 రిజిస్ట్రేషన్లు జరిగాయి, ఒకటి మాత్రమే లోకాయుక్త ఆదేశాల అమ్మాయిలకు జరిగినట్లు తెలిసింది. కొత్తపెల్లి భూముల క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్ లపై లోక్సత్తా నాయకులు చేసిన పోరాటంతో భూముల అక్రమ రిజిస్ట్రేషన్ విషయం తెలుగులోకి వచ్చింది. లోకాయుక్త సూచనల మేరకు జిల్లా కలెక్టర్ పమేలసత్పత్తి సర్వే నంబర్లు 175, 197, 198 ఇప్పటివరకు జరిగిన 476 రిజిస్ట్రేషన్ లను రద్దు చేయాలని స్టేషన్ శాఖకు ఆదేశాలు జారీ చేశారు.అవినీతి అధికారులపై చర్యలు ఉండేనా..?175, 197, 198 సర్వే నెంబర్లలో ఫీలింగ్ యాక్ట్ అమల్లో ఉన్న, సర్వే నంబర్లలో ఎలాంటి లావాదేవీలు జరపవద్దని హైకోర్టు ఆర్డర్ ఉన్న, భూముల రిజిస్ట్రేషన్లు చేయవద్దని ఐదుసార్లు కరీంనగర్ రూరల్, గంగాధర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నోటీసులు అందినా వాటిని బుట్ట దాఖలు చేసి రిజిస్ట్రేషన్లు చేసిన అవినీతి అధికారులపై ఉన్నతాధికారుల చర్యలు తీసుకుంటారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పిన్నెల్లిగా సబ్ రిజిస్టార్ కార్యాలయాల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్న ఉన్నతాధికారులకు తెలియలేదా, కావాలనే వారు పట్టించుకోలేద అని ప్రజల నుండి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కలిపి రిజిస్ట్రేషన్లకు సంబంధించి కోట్లాది రూపాయలు అవినీతి జరిగి ఉంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రొహిబిటెడ్ భూముల్లో భూ విక్రయాలు చేసిన అక్రమార్కులు, వారిని ప్రోత్సహించిన సబ్ రిజిస్ట్రార్లపై చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం కావని ప్రజలు కోరుతున్నారు.కలెక్టర్ ఆదేశాల మేరకే రిజిస్ట్రేషన్లు రద్దు: మహేశ్వర్, ఆర్డీవో 175, 197, 198 సర్వే నెంబర్లలో అక్రమంగా జరిగిన 477 రిజిస్ట్రేషన్ లను రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు వచ్చాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు గంగాధర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల రద్దు ప్రక్రియను ప్రారంభించాము. మీ సవ్యంగా సాగితే నాలుగు రోజుల్లో ట్రాన్సిలేషన్ను పూర్తి చేస్తాము. రిజిస్ట్రేషన్ లో రద్దు ప్రక్రియ పూర్తి అయిన తర్వాత నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాము.నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం : ప్రవీణ్ కుమార్, డిఆర్ 175, 197, 198 సర్వే నంబర్లలో అక్రమంగా జరిగిన 476 రిజిస్ట్రేషన్లలో ఏ ఏ సబ్ రిజిస్టర్ ఎన్ని రిజిస్ట్రేషన్లు చేశారు, ఏ సంవత్సరంలో చేశారు అన్న వివరాలను సేకరిస్తున్నారు. రిజిస్ట్రేషన్ల రద్దు పూర్తయిన తర్వాత పూర్తి నివేదికను తయారుచేసి కొన్నతాధికారులకు పంపిస్తాను. విచారణ చేసిన తర్వాత ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు.

# మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

**పెద్దపల్లి -నవభూమి:** ఈ నెల 21న జరిగిన బూటకపు ఎన్ కౌంటర్లో మృతి చెందిన మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతోపాటు మరో 26 మంది మృతిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదన కుమారస్వామి డిమాండ్ చేశారు. పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆపరేషన్ కగారును నిలిపివేయాలని పోస్టర్లను బుధవారం ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ బూటకపు ఎన్కౌంటర్ల పేరుతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను ఆదివాసులను అతి కిరాతకంగా హత్య చేస్తుందని ఆరోపించారు. బూటకపు ఎన్కౌంటర్లో మృతి చెందిన నంబాల కేశవరావు మరో 26 మంది మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన చతిస్గడ్ ప్రభుత్వం మృతదేహాలు ఇవ్వకుండా అడ్డుకుంటుందని ఇది రాజ్యాంగ విరుద్ధమని అన్నారు.ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, ఆపరేషన్ కగారును నిలిపివేయాలని, బూటకపు ఎన్కౌంటర్లో మృతి చెందిన మృతదేహాలను కుటుంబ సభ్యులకి అందజేయాలంటే డిమాండ్ చేశారు. ఇక్కడ పౌర హక్కుల సంఘం విరసం, ప్రజాఫ్రంట్, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ప్రజా సంఘాల నాయకులు గాండ్ల మల్లేశం, బొడ్డుపల్లి రవి, బొంకూర్ లక్ష్మణ్, పులిపాక రవీందర్, గుమ్మడి కొమురయ్య, మార్వాడి సుదర్శన్, కల్లెపెల్లి అశోక్ శ్రావణ్, సుచరిత, సంతోషిని బాలసాని రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

